



జగిత్యాలలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

- మూడు ట్రామా కేర్ సెంటర్లు మంజూరు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలి
- సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

జిల్లాను హెల్త్ కేర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం..

జగిత్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాను హెల్త్ కేర్ హబ్‌గా తీర్చి దిద్దటానికి అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో మెడికల్ అండ్ హెల్త్, తెలంగాణ వైద్య విధాన పరిషత్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి పరిధిలో ఉన్న ఆసుపత్రుల బలోపేతంపై ఆయా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కళాశాల, మాతా శిశు కేంద్రానికి అవసరమైన వైద్య పరికరాలు అందజేస్తామన్నారు. జగిత్యాల జనరల్ హాస్పిటల్‌కు ఎంఆర్ఐ, స్కానింగ్ కేంద్రాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురిలో గల మూడు డయాలసిస్ సెంటర్ల రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని అన్నారు. జిల్లాను వైద్య పరంగా మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. వైద్యులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో నూటికి నూరు శాతం డెలివరీలను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఇందుకు ప్రతీ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు కృషి చేయాలన్నారు. సాధారణ ప్రసవాల శాతాన్ని పెంచాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితుల కోసం జగిత్యాల, ధర్మపురి, వేములవాడ పరిధిలో ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు. చేశామన్నారు. జిల్లాకేంద్రంలో సెంట్రల్ డ్రగ్ సెంటర్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అధికారులు, సిబ్బంది తమ పని తీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునికమైన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లాకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జిల్లాలో వైద్య విధాన పరిషత్, వైద్య ఆరోగ్య శాఖ, మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిల అభివృద్ధికి సంబంధించిన నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. రోడ్డు ప్రమాద బాధితుల కోసం ట్రామాకేర్ సెంటర్లను మంజూరు చేయాలన్నారు. జిల్లాను మెడికల్ హబ్‌గా తీర్చి దిద్దడానికి ప్రభుత్వం దృష్టి సారించడం సంతోషదాయక మన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌కు సంబంధించిన రూ.6 కోట్లు, వైద్య విధాన పరిషత్‌కు రూ. 6.25 కోట్లు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రూ.74 లక్షలు, మెడికల్ కళాశాల భవనానికి సుమారు రూ.40 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ఎంసీహెచ్ ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ ఏరియా ఆసుపత్రిలో 50 పడకల మాతా శిశు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడకు ట్రామా కేర్ సెంటర్ మంజూరు చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్, భీమారం మండలాలకు 108 వాహనాలు మంజూరు చేయాలని కోరారు. వేములవాడలో వంద పడకల ఆసుపత్రికి సరిపడా వైద్యులు, ఉద్యోగుల పోస్టులను మంజూరు చేయాలన్నారు. సూరమ్మ చెరువురు రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువ భూసేకరణ కోసం నిధులు మంజూరు చేయాలన్నారు.

వైద్య విధాన పరిషత్ భవన నిర్మాణం పూర్తి చేయాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మెట్‌పల్లిలో వైద్య విధాన పరిషత్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వ కుంట్ల సంజయ్ కోరారు. కోరుట్ల నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో పలుమార్లు విన్నవించానని గుర్తు చేశారు. మెట్‌పల్లి పట్టణంలో మాతా శిశు సంక్షేమ ఆసుపత్రి నిర్మించాలని కోరారు. కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ స్కాన్ మిషిన్ ఏర్పాటు చేయా లని విన్న వించారు. కోరుట్ల పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి భవనం పూర్తయి నెలలు గడుస్తున్నా అందులో వైద్యుల కొరత ఉన్నందున వైద్యులను నియమించాలని కోరారు. మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల నాలుగు మండలాలకు అంబులెన్స్‌లు కావా లని తెలిపారు. కోరుట్ల పట్టణంలో గల వంద పడకల ఆసుపత్రి లో అవస రమయ్యే పరికరాలను త్వరితగతన అందజేయాలని విన్నవించారు. కోరుట్ల నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న హెల్త్ సబ్ సెంటర్ భవనాలను త్వరగా పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



జిల్లాకు అవసరమైన డ్రగ్స్ పెండింగ్ బిల్లు మంజూరు ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కోరారు. జగిత్యాల ప్రధాన ఆసుపత్రిలో ఆక్సీజన్ ప్లాంట్ రిపేర్ చేయాలన్నారు. జగిత్యాల నూకపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారు లకు వైద్య ఆరోగ్య సేవల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేసి అవసరమైన సిబ్బంది నియమించాలని కోరారు. మెడికల్ కళాశాల విద్యార్థులకు మూడు బస్‌లు మంజూరు చేయాలని, జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ప్రిన్సిపాల్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి సూపరింటెండెంట్‌లను నియమించాలని కోరారు. సమావేశంలో కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఖాద్రి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్ పాల్గొన్నారు.



హాజరైన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఉద్యోగులు

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

పెగడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలం మద్దులపల్లిలో ఆదివారం శ్రీ వేద యోగ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో యోగా గురువు కంటం గంగారాం యోగా శిక్షణ తరగతులు ప్రారంబించారు. ఈ సందర్భంగా యోగ గురువు గంగారాం మాట్లాడుతూ నిత్యం యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగాతో సయాటికా, వెన్ను నొప్పి, థైరాయిడ్, మధుమేహం వంటి సమస్యలను అధిగమించవచ్చన్నారు. శిక్షణా శిబిరంలో యోగా ట్రైనర్ చింతకింది కిషోర్ కుమార్, జుంబా డ్యాన్స్ ట్రైనర్ జుంజురు రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

పెగడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని నామాపూర్ అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులుగా తడుముల అనీల్ కుమార్‌ను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఆదివారం గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రామడుగు నారాయణ, ఉపాధ్యక్షులుగా అక్కనపల్లి నాంపల్లి, ఆరెల్లి పోచయ్య, డప్పు పోచయ్య, ఆసంపల్లి రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎలగందుల విష్ణు, సంయుక్త కార్యదర్శిగా మ్యాక ప్రవీణ్, మల్యాల రాజ్ కుమార్, కొల్లూరు శేఖర్, హరీష్‌ను ఎన్నుకున్నారు.



నరసింహుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా నరసింహ జయంత్యుత్సవాలు
ధర్మపురిలో ముగిసిన నవరాత్రోత్సవాలు 6

హనుమాన్ జయంతి ఏర్పాట్లు షురూ..
- కొండగట్టులో 20 నుంచి ఉత్సవాలు
- సమన్వయ సమావేశం నిర్వహించిన అధికారులు
7

పశువైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరత..
- ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు
8

ఆదర్శప్రాయుడు బీఆర్ అంబేడ్కర్

-మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, మే 11(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు అని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక తహసీల్ చౌరస్తాలో ప్రతి ఆదివారం-అంబేద్కర్ స్మరణ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం మహనీయుడు అంబేద్కర్‌ను స్మరించేలా కార్యక్రమం రూపొందించడం అభినందనీయం అన్నారు. అన్ని వర్గాల హక్కులు, సంక్షేమం అంబేద్కర్ పోరాటం చేశారని అన్నారు. ఆయన ముందుచూపుతో ఏర్పాటు చేసిన ఆర్టికల్ ద్వారానే తెలంగాణ కల సాకారమైందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ఆయన ఆశలు, ఆశయాలను భావి తరాలకు అందించేలా స్మరించుకోవడం సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్, దళిత సంఘాల నాయకులు మద్దెల నారాయణ, చిత్తారి ప్రభాకర్, పోనగంటి రాజన్న, నల్ల శ్యాం, నర్ర రాజేందర్, నక్క విజయ్, దుర్గయ్య, రమేష్‌బాబు, జీవన్, శేఖర్, బత్తుల ప్రదీప్‌రావు, గంగారాం, రవి మహేష్, గిరిధర్, బొల్లె రాజన్న తదితరులున్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి జాతర

కథలాపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని దుంపెట శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర ఆదివారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయాత్పూర్వం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు కోరారు. మంగళవారం తెల్లవారుజామున రథోత్సవం, పుష్పయాగం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

హెడ్ కానిస్టేబుళ్ల బదిలీలు

జగిత్యాల, మే 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 38మంది హెడ్ కానిస్టేబుల్స్‌ను బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బాసర జోన్-2 పరిధిలో పనిచేస్తున్న పీసీలకు అడహక్ హోదాలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ 9మందికి ఉత్తర్వులు జారీ చేస్తూ కేటాయించిన పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. మల్లాపూర్ మండల పీఎస్ ఎస్‌హెచ్‌వోను పీసీ 2989ని రిలీవ్ చేయాలని, సదరు రిలీవ్ తేదీని జిల్లా కార్యాలయానికి తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లాలో బదిలీ అయిన వారిలో ముగ్గురు మహిళా హెడ్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

హనుమాన్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సత్యం

మల్యాల, మే 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 20 నుంచి 22 వరకు జరిగే పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, అర్చకులు, అధికారులు హనుమాన్ జయంతి ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు కపీందర్, ఉపప్రధానర్చకులు చిరంజీవి, పర్యవేక్షకులు సునీల్‌కుమార్, హరిహరనాథ్ ఉన్నారు.

సత్యసాయి సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మెట్‌పల్లి టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సంస్థ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు ర్యాగల్ల వెలయేశ్వర్ అన్నారు. ఆదివారం మెట్‌పల్లి పట్టణంలోని చైతన్యనగర్‌లో గల సత్యసాయి మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన 146 మంది రోగులకు వాస్కులర్ ఆసుపత్రి వైద్యులు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రక్తనాళాల పరీక్షలు జరిపారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ర్యాగల్ల వెలయేశ్వర్ మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బి శ్రీనివాస్, వాసాల శరత్ చంద్ర, లక్ష్మణ్ గౌడ్, శంకర్, ఆనంద్, ప్రభు, పావని, విజయ, ఉమ, హర్షిని తదితరులు పాల్గొన్నారు.

'బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి'

రాయికల్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనిచేస్తూ మరణించిన రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ ఏగోలపు రాములు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సమతా సైనిక దళ్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాయితి శంకర్ ఆదివారం కోరారు. రాములు కుటుంబసభ్యులను ఆదివారం ఆయన పరామర్శించారు. పేదరికంతో ఉన్న కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్టు దాస్, ముక్కెర నరేష్, చింతకుంట సాయి కుమార్, నర్సయ్య, ఉపాధి హామీ కూలీలు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శివకుమార్

భీమారం, మే 11 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల బీజేపీ అధ్యక్షునిగా నాగం శివ కుమార్‌ను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి, మండల ప్రజల సంక్షేమానికి పాటుపడతానని పేర్కొన్నారు. తనకు అవకాశం ఇచ్చిన పార్టీ అధిష్ఠానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శివ కుమార్‌ను పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరో ఇద్దరికి గాయాలు


నిచిత్ వర్మ (ఫైల్)

వెల్గటూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం శాఖాపూర్ వద్ద వరంగల్-రాయపట్నం రాష్ట్ర రహదారిపై ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో నిచిత్‌వర్మ(17) అనే బాలుడు మృతిచెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం రాజక్కపల్లి గ్రామానికి చెందిన దొరిశెట్టి నిచిత్‌వర్మ(17), అతడి స్నేహితుడు పత్తిపాక కీర్తి చంద్ర(17) శాఖాపూర్‌లోని వాటర్‌ప్లాంట్‌కు స్కూటీపై నీళ్ల కోసం వెళ్లారు. బెజ్జంకి మండలం బేగంపేటకు చెందిన అన్నాజి విక్రం(20) అనేవ్యక్తి మరొకరితో కలిసి కరీంనగర్ వైపు బైక్‌పై అతివేగంగా వెళ్తూ స్కూటీని ఢీకొట్టాడు. స్కూటీపై వెళ్తున్న నిచిత్‌వర్మ, కీర్తిచంద్రలకు తీవ్రగాయాలు కాగా కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికితరలించారు. నిచిత్‌వర్మ పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కీర్తి చంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా మృతుడు నిచిత్‌వర్మ ప్రస్తుతం ఇంటర్మీడియట్ పూర్తిచేసి, హనుమాన్ మాల ధరించాడు. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి దొరిశెట్టి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైకు నడిపిన అన్నాజి విక్రమ్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి


ముత్యం రెడ్డి (ఫైల్)

గన్నేరువరం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారువెల్ల గ్రామపరిధిలోని దుబ్బపల్లికి చెందిన ఏలేటి ముత్యంరెడ్డి (63) పురుగులమందు తాగగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఎస్ఐ తాండ్ర నరేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలేటి ముత్యం రెడ్డి గతంలో అడవిపంది దాడిలో గాయపడగా నాడీవ్యవస్థ దెబ్బతింది. కొద్దిరోజులు మంచానికే పరిమితం అయ్యాడు. దీంతో అనారోగ్యసమస్యలు తీవ్రమవడంతో మన స్థాపానికి గురై శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ముత్యంరెడ్డి భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

పెద్దపల్లి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుర్రాంపల్లి గ్రామానికి చెందిన అటుకుల రవిందర్‌రెడ్డి (45) అనే రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం రవిందర్‌రెడ్డి వ్యవసాయ కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడని, ఇటీవల కూతురు వివాహం చేయగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అయ్యాయని మద్యానికి బానిసైనట్లు తెలిపారు. ఈనెల 9న రాత్రి పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి


మృతి చెందిన మల్లేష్

ముత్తారం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైదంబండ గ్రామానికి చెందిన పందుల మల్లేష్ (17) అనే యువకుడు ఆదివారం ట్రాక్టర్ కింద పడి మృతి చెందినట్లు ఎస్ఐ గోపతి నరేష్ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన పందుల శేఖర్‌కు చెందిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేసేందుకు మల్లేష్ వెళ్ళగా వడ్లను నిమ్మల కుమార్ చెందిన ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్నారు. ఒక్కసారిగా ట్రాక్టర్ ముందుకు వెళ్ళడంతో అదుపు చేసేందుకు మల్లేష్ ప్రయత్నించగా టైర్ కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో అక్కడే ఉన్న రైతులు మల్లేష్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కోరుట్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గొడుగు రాజవ్వ(75) అనే వృద్ధురాలు గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆదివారం మృతిచెందినట్లు కోరుట్ల ఎస్ఐ2 రామచంద్రుడు తెలిపారు. రాజవ్వ కోరుట్ల పట్టణంలో కూలి పని చేస్తూ జీవిస్తోంది. అర్బన్ కాలనీ వద్ద జాతీయరహదారిని దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. రాజవ్వ కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ రామచంద్రుడు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

తిమ్మాపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన ఓవ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన తిరుపతిరావు ఆదివారం తన భార్యకు ఫోన్‌చేసి తను గడ్డిమందు తాగినట్లు తెలిపాడు. వెంటనే ఆమె స్థానికులకు సమాచారం అందించగా వారు సంగంపల్లి గ్రామశివారులో అపస్మారకస్థితిలో ఉన్న తిరుపతిరావుని గుర్తించారు. వెంటనే అతడిని 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. కొన్ని నెలలక్రితం తిరుపతిరావు కొడుకు నిఖిల్‌రావు ఆన్‌లైన్‌లో గేమ్ ఆడి డబ్బులను పోగొట్టుకొని మన్నెంపల్లి శివారులో బావిలోపడి మృతిచెందాడు. అప్పటి నుంచి మనస్థాపంతో ఉన్న తిరుపతిరావు ఆదివారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇదిలాపూర్ గ్రామ శివారులో ఆదివారం కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేటకు చెందిన చొప్పరి సదానందం ద్విచక్ర వాహనంపై వస్తుండగా జమ్మికుంట నుంచి గోదావరిఖనికి వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు సదానందం కాళ్లకు,తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన సదానందంను ఆటోలో మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లికి తరలించారు. గ్రామస్థులు కారును అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


మణిచరణ్(ఫైల్)

రాయికల్, మే 11 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం కుమ్మరిపల్లిలో ఈతకు వెళ్లి జగిత్యాలకు చెందిన మణిచరణ్ (13) ఆదివారం మృతిచెందాడు. జగిత్యాలకు చెందిన బింగిరాధ చిన్న కుమారుడు మణిచరణ్ రాయికల్‌లోని అమ్మమ్మ ఇంటివద్ద ఉండి స్థానికప్రైవేట్ పాఠశాలలో 9వతరగతి చదువుతున్నాడు. కుమ్మరిపెల్లిలోని బంధువుల ఇంటికి ఆదివారం వెళ్లి ఈత కొడతామని వ్యవసాయ బావిలో దిగగా ఈతరాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు.

రోగుల సంరక్షణలో నర్సుల పాత్ర కీలకం

నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



జగిత్యాల/కళ్యాణ్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): రోగుల సంరక్షణలో కనిపించే దేవుళ్లలా పని చేసేవారు నర్సులు. తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా రోగులకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా నర్సులు పని చేస్తున్నారు. అంతర్జాతీయ నర్సింగ్ డేను యేటా మే 12న ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు సందర్భంగా నర్సింగ్ డేను జరుపుకుంటారు. తమకు ఎన్ని కష్టాలున్నా విధుల్లో అంకితభావంతో పని చేసేవారు నర్సులు. కరోనా మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఎంతో మందిని కాపాడారు. ప్రపంచంలో ఆరోగ్య కార్యకర్తల్లో సగానికి పైగా నర్సులు ఉన్నారు. విధుల్లో ఒత్తిడికి గురి కావడం, రోగుల సంరక్షణలో ఏదైన జరుగరానిది జరిగినప్పుడు రోగి బంధువులు నర్సులనే లక్ష్యం చేస్తూ దాడులకు, బెదిరింపులకు పాల్పడడం, కొన్ని సందర్భాల్లో నర్సులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. రోగులకు చికిత్స అందించే సమయంలో వారికి సరైన రక్షణ, సౌకర్యాలు లేకపోవడం, రోగుల నుంచి సంక్రమించే వ్యాధులను వారిని వేధిస్తున్నాయి. ఎందరో అంటువ్యాధుల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా వృత్తినే పరమావధిగా భావించే నర్సులు రోగులకు అపారమైన సేవలందిస్తూ వారి ప్రాణాలను కాపాడడంలో నర్సుల పాత్ర కీలకం.

సేవ చేయడమే లక్ష్యం...

- సౌందర్య, నర్సింగ్ సూపరింటెండెంట్



ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రోగులకు సేవలు అందించడమే తమ లక్ష్యం. కరోనా సమయంలో కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించా. విధుల్లో ఇబ్బంది అయినా తట్టుకుంటున్నాం.

మిలటరీలో నర్సుగా చేరుదామనుకున్నా..

- సుమలత, నర్సు



ఆర్మీలో పని చేసే వారికి సేవ చేసేందుకు మొదట మిలిటరీలో నర్సుగా చేరాలనుకున్నా. ప్రయత్నం విఫలమయ్యింది. ఎంఎస్ నర్సింగ్ చేసి ప్రభుత్వ నర్సుగా నాలుగు సంవత్సరాల క్రితం జాయిన్ అయ్యా. ఎందరో రోగులు అవస్థతో వస్తుంటారు. వారికి రోగం నయం చేసిన తరువాత వారు పెట్టే దీవెనలు ఆనందాన్ని కలిగిస్తాయి.

రోగులను కంటికి రెప్పలా కాపాడతాం

-ప్రమిత, హెడ్ నర్సు, వైద్య సేవా అవార్డు గ్రహీత, రాయికల్



కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి కొవిడ్ వార్డుల్లో విధులు నిర్వహించాం. మేము దగ్గరుండి అన్ని రకాలుగా భరోసా కల్పించగా ఎంతో మంది మళ్లీ ఆరోగ్యంగా ఇంటికి వెళ్లడం సంతోషాన్నిచ్చింది. డాక్టర్లు సూచించిన చికిత్సలను రోగులకు అందిస్తూ కంటికి రెప్పలా కాపాడుతూ అంకిత భావంతో సేవలు అందిస్తున్నాం.

రెండు బైక్‌లు ఢీ

● ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద రెండుబైక్‌లు ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి చెందిన అక్కపల్లి లింబాద్రి బైక్‌పై కేశవపట్నం మెయిన్ రోడ్డుకు వస్తుండగా అంబేద్కర్ చౌరస్తా నుంచి కేశవపట్నంలోకి వెళ్తున్న బైక్ ఢీకొంది. దీంతో లింబాద్రి తన బైక్‌పై నుంచి కిందపడి పోయాడు. ఈ ఘటనలో లింబాద్రి కాలు విరిగింది. గమనించిన స్థాని కులు వెంటనే 108లో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బీట్ ఆఫీసర్‌పై దాడి.. ఒకరిపై కేసు నమోదు

చందుర్తి, మే 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కలపను తరలి స్తున్న వ్యక్తిని అడ్డుకున్న అటవీశాఖ అధికారిపై ఓ కలప స్మగ్లర్ దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం దేవునితండాలో శనివారం జరిగింది. చందుర్తి ఎస్ఐ అంజయ్య కథనం ప్రకారం దేవునితండా చెందిన అజ్మీరా తిరుపతి అనే వ్యక్తి సనుగుల అటవీ ప్రాంతం నుంచి కలపను తరలిస్తుండగా బీట్ ఆఫీసర్ బాలకృష్ణ అడ్డుకోవడంతో తిరుపతి అటవీశాఖ అధికారిపై దాడికి పాల్పడ్డాడు. బీట్ ఆఫీ సర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదివారం తెలిపారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


రాజన్న ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఓదెల, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గుంపులలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. గుంపుల సమీపంలోని మానేరువాగు నుంచి ఇసు కను అనుమతి లేకుండా తరలిస్తున్నారనే సమాచారంతో వెళ్లి పరిశీలించగా ఇసుక ట్రాక్టర్ పట్టుబడిందని, అలాగే సంబంధిత వ్యక్తిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్సై తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.


గుంపులలో పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

షాపులోకి దూసుకెళ్లిన గ్రానైట్ లారీ

హుజూరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో ఆదివారం తెల్లవారు జామున గ్రానైట్ లారీ షాపులోకి దూసుకెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ నుంచి గ్రానైట్ లారీ హుజూరాబాద్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు బయటకు వెళ్తుండగా, బస్సును చూసిన గ్రానైట్ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో పక్కనే కరెంట్ స్తంభాన్ని ఢీ కొని షాపులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు వెనుక భాగం పాక్షికంగా దెబ్బతింది. షాపులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే బస్టాండ్ ఏరియాలో సుమారు 6గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని లారీని తొలగించారు. లారీడ్రైవర్‌పై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.


హుజూరాబాద్‌లో షాపులోకి దూసుకెళ్లిన గ్రానైట్ లారీ

రోడ్డు పక్కన నిల్చున్న యువతిని ఢీకొట్టిన కారు

● సంఘటన స్థలంలోనే మృతిచెందిన యువతి
● మరొకరి పరిస్థితి విషమం


మృతి చెందిన మౌనిక

చిగురుమామిడి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరి గ్రామ శివారులో హుస్నాబాద్-కరీంనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ ఫంక్షన్‌హాల్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ట్రైనీ ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా జాబితాపూర్‌కు చెందిన మౌనిక(24) తన సోదరుడితో కలిసి సుందరగిరి గ్రామానికి చెందిన వారి బంధు వుల వివాహానికి వచ్చారు. గ్రామశివారులో ఉన్న ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహానికి హాజరై భోజనం చేసి సోదరుడితో కలిసి బయటకు వచ్చి రోడ్డు పక్కన నిల్చున్నారు. ఇంతలో హుస్నాబాద్ నుంచి కారు(టీఎస్ 02ఇజడ్9907) వేగంగా వచ్చి ఇద్దరిని ఢీకొట్టింది. దీంతో మౌనిక సంఘటన స్థలం లోనే మృతిచెందింది. మౌనిక సోదరుడికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమ్మిత్తం కరీంనగర్‌కు అంబులెన్స్‌లో తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోరుట్ల రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని సీసీఎస్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. కాకతీయ కాలువను ఆనుకొని ఉన్న వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్న వారిని గుర్తించి వారి వద్ద రూ.12,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోరుట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒకరిపై దాడి.. కేసు నమోదు

వీణవంక, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన అమ్మ మహేందర్ తన ఇంటి పక్కన నిర్మాణ పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన ఎజ్జారాజు అడ్డుకున్నాడు. బూతులు తిడుతూ కర్రతో దాడి చేయగా మహేందర్ తలకు గాయాలయ్యాయి. మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రాజుపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబేషనరీ ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

● వేములవాడలో పట్టువస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
● ధర్మపురిలో పూజల్లో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ


వేములవాడలో విశేషాలంకరణలో స్వామి వారి ఉత్సవమూర్తులు

వేములవాడ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయం నాంపల్లి గుట్టపై వెలసిన శ్రీ భూనిలా సహిత లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామి వారికి అభిషేకం, హోమం, బలిహరణం నిర్వహించారు. కొండపైనున్న ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులను పూలతో అందంగా అలంకరించిన కల్యాణ వేదిక వద్దకు డప్పుచప్పుల్లు, కళాకారుల నృత్యాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ , రాజన్న ఆలయ ఈవో కె వినోద్‌రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు రాచకొండ రామాచారిసంధ్యారాణి దంపతులు కన్యాదాతలుగా వ్యవహించగా, అర్చకులు రాచకొండ విజయేంద్రచారి, రామకృష్ణాచారి, హర్షవర్ధనచారి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణతోపాటు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతీఒక్కరి బాధ్యత అన్నారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా కరీంనగర్ సజ్జప్ప కళాక్షేత్రం, సజ్జప్ప కూచిపూడి డ్యాన్స్, మ్యూజిక్ అకాడమీ వారి కళాప్రదర్శనలు అందరిని అలరించాయి. కళాకారులను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సన్మానించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవానికి వరంగల్‌కు చెందిన తోపుచెర్ల శ్రీనాథ్‌స్వాతి దాతలుగా వ్యవహరించగా. ముస్తాబాద్‌కు చెందిన రానమడుగు నర్సింగారావు భక్తులకు తాగునీరు అందించారు. కల్యాణం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాస్, అశోక్, ఈఈ రాజేశ్, డిఈ మహిపాల్ రెడ్డి, సూపరిండెంట్లు వెంకటరాజు, పూజిత, ఆలయ ఇన్‌చార్జి నరేందర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురిలో.. నరసింహస్వామి జయంత్యుత్సవాలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో నరసింహ జయంతి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసకపూర్వక, శోడషోపచార పూజ నిర్వహించారు. నృసింహ జయంతి సందర్భంగా రాజగోపురాలకు, శ్రీ స్వామి వారలకు, దేవాలయాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో రెండు లడ్డు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 3 నుంచి ఆరంభమైన నరసింహ నవరాత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి.

● హోమంలో పాల్గొన్న మంత్రి దామోదర..

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఆవరణలో గల యాగశాల వద్ద నిర్వహించిన నరసింహ హోమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం పాల్గొన్నారు. లోకక్షేమార్థం, కుటుంబసౌభాగ్యం కోసం నిర్వహించిన నిత్య నరసింహ హోమంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహచే ఆలయ అర్చకులు నంబి అరుణ్‌కుమార్, చక్రపాణి కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి యాగశాల వద్ద భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. యాగశాల వద్ద మంత్రికి ఆలయ అర్చకులు తీర్థ, ప్రసాద వితరణ జరిపి, ప్రసాదాలు బహూకరించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


వేములవాడలో స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజన్న ఆలయ ఈవో వినోద్


ధర్మపురిలో పూజలందుకుంటున్న నర్సింహస్వామి


ధర్మపురిలో మంత్రి దామోదర రాజనర్సింహకు స్వామి వారి ఫొటోను అందజేస్తున్న ఎమ్మెల్యే,విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అధికారులు

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

● బ్రాందీ షాపుపై దాడి
● ముగ్గురిపై కేసు

కోల్‌సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఊర్వశి థియేటర్ సమీపంలోని మెగావైన్స్‌లో శనివారం రాత్రి ముగ్గురు యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. వైన్స్‌లోని సిట్టింగ్ రూమ్‌లో మద్యం సేవించిన చింటు, మల్లికార్జున్, ఆరీఫ్ అనే యువకులు వైన్స్ కౌంటర్‌లోకి చొరబడి గొడవకు దిగారు. బీరు సీసాలు, ఇతర మద్యం బాటిళ్లను పడేశారు. కౌంటర్‌లోని వ్యక్తులను చంపుతామని బెదిరింపులకు గురి చేశారు. దీంతో మద్యంషాపు నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వీరిపై కేసు నమోదైంది. షాపులోని సీసీ ఫుటేజీలో ఈ దాడి దృశ్యాలు రికార్డు అయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తమదైన పద్ధతిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకోగా గొడవకు కారణమైన నిందితుడు మల్లికార్జున్ పరారీలో ఉన్నట్టు తెలుస్తున్నది.

హనుమాన్ జయంతి ఏర్పాట్లు షురూ..

• కొండగట్టులో 20 నుంచి ఉత్సవాలు
• సమన్వయ సమావేశం నిర్వహించని అధికారులు


కొండగట్టు అంజన్న ఆలయం

మల్యాల, మే 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 20 నుంచి మూడు రోజుల పాటు హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఆలయానికి రంగులు వేసే పనులు సాగుతున్నాయి. ప్రధాన ఆలయం రాజగోపురం, ప్రాకారం తదితర వాటికి రంగులు వేస్తున్నారు. ఈ పనుల పూర్తికి మరో ముడు రోజులకు పైగా పట్టనుండగా మిగతా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. మరికొన్ని చిన్న హనుమాన్ జయంతికి ఏర్పాటు చేసిన వాటినే కొనసాగించనున్నారు. అయితే చలువ పందిళ్ల కోతులతో, అకాల వర్షంతో దెబ్బతినగా వాటికి మళ్లీ మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

● సమన్వయ సమావేశం ఎప్పుడో..?

హనుమాన్ జయంతి ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేసేందుకు గాను ప్రతి ఏటా నిర్వహించే సమన్వయ సమావేశం ఇంత వరకు నిర్వహించలేదు. దీంతో జయంతి ఏర్పాట్లపై ఎవరికి వారే అన్న తీరుగా మారుతోంది. ప్రతి ఏటా జయంత్యుత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు కొండగట్టుకు వస్తుంటారు. దీనికి గాను పదిహేను రోజుల ముందుగానే ఎమ్మెల్యే, కలెక్టర్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నత అధికారులతో ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై చర్చించి తగు చర్యలు చేపట్టడానికి సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఈసారి పెద్ద జయంతి వేడుకలకు మరో పది రోజుల గడువు మాత్రమే ఉంది. ఉత్సవాల సందర్భంగా పోలీసు, పంచాయతీరాజ్, రెవెన్యూ, మిషన్ భగీరథ, ఆర్టీసీ, ఫైర్, నీటి పారుదల శాఖ తదితర శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించనుండగా ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి కేటాయించిన పనులలో ఇదివరకే నిమగ్నం కావాల్సి ఉంది. గత చిన్న జయంతి ఏర్పాట్లే ఇప్పుడు కొనసాగించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నప్పటికీ ఉత్సవాల సందర్భాలలో ప్రతి ఏటా భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా సమన్వయ సమావేశం నిర్వహించి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు కోరుతున్నారు.


కొండగట్టు ఆలయానికి రంగులు వేస్తున్న సిబ్బంది

హుజూరాబాద్‌లో రూ.200 దొంగ నోట్ల కలకలం


వ్యాపారికి వచ్చిన దొంగ నోటు

హుజూరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అసలు, నకిలీ నోట్లకు తేడా లేకుండా పోతోంది. తాజాగా హుజూరాబాద్ పట్టణంలోని ఓ కిరాణం షాపులో సామాను తీసుకొని ఓ వ్యక్తి రూ.200 నోట్లు ఇచ్చారు. ఇది గమనించకుండా సదరు వ్యాపారి తీసుకొన్నాడు. వాటిని మరో వ్యక్తికి ఇస్తుండగా రెండు రూ.200నోట్లు నకిలీగా గుర్తించారు. దీంతో వ్యాపారి కంగుతిన్నాడు. దొంగనోట్లు కూడా అసలుకు తేడా లేకుండా ఉండడంతో లబోదిబోమన్నాడు. గతంలో కూడా రూ.500 దొంగ నోట్లు వచ్చిన సంఘటనలున్నాయి. ఇప్పటికైనా పోలీసులు దొంగ నోట్లపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో అల్ఫోర్స్ చరిత్రాత్మక విజయం



ఎప్‌సెట్‌లో ర్యాంకులు సాధించిన టాపర్లతో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి

సుభాష్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థలు చరిత్రాత్మక విజయం సొంతం చేసుకున్నాయి. కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. బి వర్షిత్203, అదిబాఫిర్దోజ్ 206, ఎం ప్రణీత్ 250, కె మనోజ్‌కుమార్ 286, బి శ్రీనిత్య 296, జి కౌషల్‌ప్రియ 339, జి రిషిత 438, జె అనూష 447, కె అర్చన 485, ఎండి అబ్దుల్‌జిషాన్ 551, సిహెచ్ శ్రీనిధి 567, ఎంరోహిత్‌రెడ్డి 606,అబుఉమేర 614, హాన్సమహావిష్ 639, పి శ్రీనిత్యరెడ్డి 704, కె శ్రీరామ్ చరణ్732, కె హాసిని 735, రాంసకోరిన్ 738, డి సుమగ్నయ752, ఎల్ శరణ్య762, జి సింధు763, బి అభిజ్ఞ 801, జె వామిక 807, వి అక్షయ్ 831, డి హరిశంకర్ 838, బి భువనకృతి 839, ఎ శశిప్రీతమ్ 853, కె సాయిశ్రేయాన్‌రెడ్డి 908, వి హృషికేష్ 920, మహ్మద్ సఫ్రోజ్ 927, కె గాయత్రి 992, ఎ శ్రీనిజరెడ్డి 997ర్యాంకు సాధించారు.33మంది విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించగా, 72మంది విద్యార్థులు 2000లోపు ర్యాంకులు, 102 మందివిద్యార్థులు 3000లలోపు ర్యాంకులు, 192మంది విద్యార్థులు 5000లలోపు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించారని అభినందించారు. ఇటీవల ప్రకటించిన ఐఐటి మెయిన్స్ ఫలితాల్లో కూడా ఆల్ఫోర్స్ మంచి ఫలితాలు సాధించిందని తెలిపారు. 461 మంది విద్యార్థులు ఐఐటి మెయిన్స్‌కు అర్హత సాధించారని తెలిపారు. పటిష్టమైన ప్రణాళికతో బోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషితో ఘనవిజయాన్ని సాధించామన్నారు. రానున్న ఐఐటీ అడ్వాన్స్, నీట్ పరీక్ష ఫలితాల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడానికి అధ్యాపకులు, తల్లిదండ్రుల కృషి ఎంతగానో ఉందని వారందరినీ అభినిందుస్తున్నట్లు తెలిపారు.

● అధ్యాపకులు, తల్లిదండ్రుల సహకారంతో ర్యాంకు సాధించాను..

- అదిబఫిర్దోస్, 206 ర్యాంకు



మా నాన్న చిరువ్యాపారి అయినప్పటికీ మమ్మల్ని బాగా చదివిస్తున్నారు. నేను ఈ ర్యాంకు సాధించడానికి తల్లి దండ్రుల సహకారం, అధ్యాపకులు కృషి ఎంతగానో ఉంది. ఎప్‌సెట్‌లో 206 ర్యాంకురావడం ఉత్సాహాన్నిచ్చింది. నీట్‌లోనూ మంచి ర్యాంకు సాధిస్తాను.

ట్రినిటి విద్యార్థుల విజయభేరి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

సుభాష్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్-2025 ఫలితాల్లో ట్రినిటి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కబనరిచి ర్యాంకుల సాధనతో విజయభేరి మోగించారు. తమ విద్యార్థులు 405, 430, 560, 697, 730, 760, 791, 859, 934, 1104, 1166, 1546, 1619, 1795, 1950 ర్యాంకులు సాధించినట్లు ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. అలాగే 10 వేలలోపు 89 మంది ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్‌తో పాటు ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి అభినందించారు.

ఎస్ఆర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

గణేశ్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ జోనల్‌ఇన్‌చార్జి నేదురు తిరుపతి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అత్యున్నతమైన ఫలితాలను సాధించి ఎస్ఆర్ విద్యాసంస్థల కీర్తిని చాటిచెప్పిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఎం.వినయ్ 149వ ర్యాంకు, ఎం కార్తీక్ 234, జాభిరామ్ 471, సిహెచ్ హన్సిక 539, ఎం రాజా వర్షిత్‌రెడ్డి 564, బి.మాధవ్ 750,కె సంజయ్ 886,జి.శివసాయి,887,ఎన్ పూజిత1077, ఆదిత్య 1304, ప్రాశిత్ 2179, వి అమూల్యశ్రీ 2457, ఎం. రుశీశ్వర్‌రెడ్డి 2672, జే.సహస్ర 3487, కె.తేజశ్రీ 5032, బి.నాగచైతన్య 5565, కె.జాహ్నవి3896, బి ఆదిత్య వర్ధన్5838, అంజిరెడ్డి 6527 , బి.ప్రవళిక 6797, కె.రాకేష్ 6999, మనుష 7052, డి సాయి చందన 7251, ఎం.సుమలత 8005, కటకం శ్రీలేఖ 8088, డి.రాజ్‌కుమార్8323, ఎన్ శ్రీచరణ్ జోషి 8522, అబ్దుల్ రాయన్9213, శివరామ్9333, ఎన్ సాయిశ్రీనిక 9542, బి సహస్ర 9851, రాష్ట్రస్థాయిలో అఖండ విజయాన్ని సాధించిన విద్యార్థులను, ప్రోత్సహించిన వారి తల్లిదండ్రు లను, అధ్యాపకబృందానికి ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, సీఈవో, డీజీఎం, జోనల్ ఇన్‌చార్జి, అకడమిక్ డీన్స్ ప్రిన్సిపాల్స్ శుభాకాంక్షలు తెలిపారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఎస్ఆర్ విద్యాసంస్థల అధ్యాపకులు

శ్రీచైతన్య విద్యార్థుల విజయఢంకా

సుభాష్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ర్యాంకుల ప్రభంజనం సృష్టించారు. గోకులకొండ వైష్ణవి 810, బి మనోజ్ఞ 968, బి సాత్విక్ 1142, పి స్ఫూర్తిశ్రీ 1527, బి శ్రావణి 1803, పి బ్లెస్సీ సునన్ 2106, పి చందన 2165, పి భరత్‌రెడ్డి 2815, పి అజితేష్ 3016, కె అనూహ్య 3503, వి ప్రవీణ్, వి రిషి 3996, జి అర్చన 4171, ఆర్ శ్రీయాన్ 4246, వి శివాణి 4570, బి స్రవంతి 4957తో పాటు 16 మంది విద్యార్థులు 5000లోపు, 51మంది విద్యార్థులు 10వేల లోపు రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా చైర్మెన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల ప్రణాళిక, అధ్యాపకుల కృషితో విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించారని అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.


వైష్ణవి (810 ర్యాంకు)


మనోజ్ఞ (968 ర్యాంకు)

శాతవాహన పరిధిలో 14నుంచి డిగ్రీ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు టైం టేబుల్ ప్రకారం మే14 నుంచి యధావిధిగా జరుగుతాయని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా. డి సురేష్‌కుమార్ తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించిన కళాశాల విద్యార్థులకే పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా పరీక్ష ఫీజు చెల్లించని అనేక ప్రైవేటు కళాశాలలు 12వ తేదీలోగా ఫీజు చెల్లిస్తాయని భావిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. త్వరలోనే విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ చేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా ప్రారంభమైన ఏజెఆర్ ఆటోమోటివ్స్

● ప్రారంభించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి


ఏజెఆర్ ఆటోమోటివ్ షోరూంను ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు మెయిన్ రోడ్డులో విట్స్ కళాశాల ఎదురుగా బుల్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఏజెఆర్ ఆటోమోటివ్ షోరూం ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి బుల్ మిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సౌత్ జోన్ హెడ్ వి సోమసుందరం, బుల్ మిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్టేట్ హెడ్ ఎన్ సురేష్‌బాబు, షోరూం అథరైజ్డ్ డీలర్ అంబటి జోజిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ బుల్ కంపెనీ ఒక స్టాండర్డ్ పోర్టు, స్టాండర్డ్ క్వాలిటీ, మంచి పెర్ఫార్మెన్స్‌తో ఉంటుందని తెలిపారు. కంపెనీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. లోడ్ వర్క్స్‌గానీ, ఇసుక వర్క్స్‌గానీ, మట్టి పనులకు ఎక్కడ అవసరం ఉన్నా ఈ కంపెనీని తప్పకుండా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. జోజిరెడ్డి మాట్లాడుతూ బుల్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్‌తో గంటకు లీడర్ డీజిల్ ఆదా అవుతుందన్నారు. ఇతర వెహికిల్స్‌కన్నా మెరుగైన పనితీరు, మెరుగైన క్వాలిటీతో ఉంటుందని తెలిపారు. సేవలు అవసరం ఉన్నవారు వెహికిల్ డెమో బుక్ చేసుకోవాలని కోరారు. అలాగే సర్వీస్ విషయంలో కూడా 100 శాతం క్వాలిటీతో అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ జగ్గారెడ్డి, సంతోష్, కంపెనీ ప్రతినిధులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

జూపాకలో అగ్నిప్రమాదం

హుజూరాబాద్ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూపాక గ్రామంలో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామంలోని వ్యవసాయక్షేత్రంలోని వరికొయ్యలకు నిప్పుపెట్టడంతో మంటలు పెద్దఎత్తున వ్యాప్తించాయి. ఈ మంటలు కాస్తా ఇళ్ల సమీపంలోకి వ్యాపించడంతో గ్రామస్థులు వెంటనే బకెట్లతో మంటలను గ్రామస్థులు ఆర్పారు. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి మంటలను పూర్తిగా ఆర్పేశారు.

వృత్తిపేరే.. ఇంటిపేరు..



• ఉపాధి ఆధారంగా మారుతున్న నామధేయాలు
• అసలు పేరు కొసరుగా మారుతున్న వైనం

జమ్మికుంట రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన ఇద్దరు చిన్ననాటి మిత్రులు చాలాకాలం తర్వాత ఓ శుభకార్యంలో కలుసుకున్నారు. బడిలో కలిసి చదు వుకున్న జ్ఞాపకాలను నెమరువేసు కున్నారు. యాంత్రిక జీవనంలో ఇన్నాళ్లు గడిపిన మిత్రుల మధ్య మళ్లీ మాటల చాటింగ్‌లు పెరిగాయి. ఓ రోజు శ్రీనివాస్ అనేమిత్రుడు అనుకోకుండా జమ్మికుంటకు వచ్చాడు. పని పూర్తి చేసుకున్న అనంతరం తన చిన్ననాటి స్నేహితుడైన పొనగంటి సంపత్‌ను కలవాలని అనుకున్నాడు. వెంటనే మిత్రుడికి ఫోన్‌చేశాడు.. కలవడం లేదు. సరేలే అని ఇంటికి వెళ్దామని బయల్దేరాడు. సంపత్ ప్రస్తుతం అక్కడ ఉండటం లేదు. ఈ విషయం తెలియడంతో అక్కడ ఉన్న వారిని అడిగాడు. పొనగంటి సంపత్ అనే వ్యక్తి ఇక్కడ ఉండడని వారు తెలిపారు. దీంతో నిరాశగా తిరుగుప్రయాణం అయ్యాడు. తర్వాత ఈ విషయం తన మిత్రుడికి ఫోన్‌లో వివరించాడు. అప్పుడు సదరు మిత్రుడు సంపత్ అసలు విషయం చెప్పాడు. ఒరేయ్ నేను జేసీబీ(ఎక్స్‌కావేటర్) కొన్నాను. అప్పటి నుంచి నన్ను అందరూ ఇంటి పేరు కాకుండా పేరు పక్కన జేసీబీ సంపత్ పిలుస్తారు. అలా నా ఇంటి పేరు, నాపేరును నాకు తెలియకుండానే మార్చేశారు. మా ప్రాంతంలో జేసీబీ సంపత్ అంటేనే అందరికీ తెలుసని చెప్పాడు. పాతికేళ్లుగా తనవృత్తి తనఇంటి పేరుగా ముద్ర పడిపోయిందని సమాధానం ఇచ్చాడు. ఇలా జమ్మికుంటలో చాలామంది ఇంటిపేర్లు మారిపోయాయి. వారు చేస్తున్న పనే వారి ఇంటి పేరుగా మారింది. వారి ఇంటి పేర్లతో పిలిస్తే ఎవరికీ తెలియదు. వారు చేస్తున్న పని పేరు చెప్పి పిలిస్తేనే అందరికీ అర్థమవుతుంది. అటువంటి వారి గురించి ఓ సారి తెలుసుకుందాం..



జేసీబీ కొన్నాను.. అదే నా ఇంటి పేరుగా మారింది..

- పొనగంటి సంపత్, జమ్మికుంట


వ్యాపార అవసరాల కోసం 28 ఏళ్ల క్రితం జేసీబీ కొన్నాను. జమ్మికుంట పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం, పూడికతీత, కాంట్రాక్ట్ పనులు చేసేవాడిని. జమ్మికుంట ప్రాంతంలో మొట్టమొదటిసారి జేసీబీ కొనుగోలు చేయడంతో నాపేరు జేసీబీ సంపత్‌గా మారిపోయింది. ఇప్పుడు పొనగంటి సంపత్ అంటే ఎవరికీ తెలియదు. జేసీబీ సంపత్ అంటే చిన్నపిల్లాడైనా గుర్తుపడతాడు.



వ్యాపారమే నా ఇంటి పేరుగా మారింది

- కర్రె సుబ్బారావు, జమ్మికుంట

జమ్మికుంటలో 40 సంవత్సరాలుగా షాబాద్ బండ వ్యాపారం చేస్తున్నాను. దీంతో నా ఇంటి పేరు బండ సుబ్బారావుగా మారిపోయింది. ఈ పరిసర ప్రాంతాల్లో ఇప్పటివరకు నా ఇంటి పేరు ఎవరికీ తెలియదు. నా పేరు బండ సుబ్బారావు అని పిలిస్తేనే అందరికీ తెలుస్తుంది.



నన్ను పొగాకు కొండయ్య అనే పిలుస్తారు..

- మురికి కొండయ్య, జమ్మికుంట

20 సంవత్సరాల క్రితం పొగాకు వ్యాపారం చేశాను. తర్వాత ఎలక్ట్రికల్ షాప్ పెట్టుకున్నాను. మొదట పొగాకు వ్యాపారం చేశాను కాబట్టి నా పేరు పొగాకు కొండయ్యగా మారిపోయింది. నా సొంత ఇంటి పేరు మురికి కొండయ్య అంటే ఎవరికీ తెలియదు. ఎలక్ట్రికల్ షాపు పెట్టుకున్నప్పటికీ పొగాకు కొండయ్య అని పిలుస్తారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

జగిత్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమానికే ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పావని కంటి ఆసుపత్రి, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన నిరుపేదలు 16 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. అనంతరం ఉచిత కళ్ల అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ సందర ్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ మాట్లాడారు. పావని కంటి ఆసుపత్రిలో గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు విజయ్, ములసపు మహేష్, చిట్ల మనోహర్, ఆసుపత్రి సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ధన్వంతరి ఆలయంలో కల్యాణం

జగిత్యాల అగ్రికల్చర్, మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసూర్య ధన్వంతరి దేవాలయంలో ఆదివారం కల్యాణ మహోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు స్వామివారి ప్రసాదంగా అన్నదానం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ బాధ్యులు డాక్టర్ వడ్లగట్ల రాజన్న, వొడ్నాల శ్రీనివాస్, గట్టు రాజేందర్, భారతాల రాజసాగర్, ఆలయ అర్చకులు చిలుకముక్కు నాగరాజు, విష్ణు అధ్యక్షులు పాల్తెపు శంకర్, ధనుంజయ్, విద్యాసాగర్, గుడిసె వెంకట్రాజం, తవుటు రాంచంద్రం, పెద్ది శ్రీనివాస్, పూర్ణచందర్, గుండా శ్రీనివాస్, ప్రవీణ్, సింహాద్రి, రమేష్, రాంచందర్, సూరన్న, రఘునందన్ తోపాటు మహిళా సభ్యులు లత, స్వాతి, గీత, జయశ్రీ, అన్నపూర్ణ, సునీత, దేవి తో పాటు భక్తులు, మాతలు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ధర్మపురి, మే 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీ నరసింహ జయంతి సందర్భంగా స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు వుత్తూరి వైకుంఠం-లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి స్వామి వారల జయంతి ఉత్సవాల్లో దర్శనం కోసం వచ్చే భక్తులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ అనేది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన వైకుంఠం-లక్ష్మి దంపతలుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తలు రాపర్తి సాయికుమార్, బొల్లారపు పోచయ్య, గుడ్ల రవీందర్, బాదినేని వెంకటేష్, నేదునూరి శ్రీధర్, కొమిరెల్లి పవన్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రంగ శంకరయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర రాజనర్సింహకు వినతుల వెల్లువ

జగిత్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి ఆదివారం వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతులు వెల్లువెత్తాయి. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీఓ మధుసూదన్‌లు పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తదితరులు పూలమొక్కలు అందించి స్వాగతించారు. ఎస్సీ వర్గీకరణకు మంత్రి దామోదర రాజనర్సింహ కీలకంగా కృషి చేశారంటూ ప్రజా సంఘాల జేఏసీ నాయకులు అంబేద్కర్ చిత్ర పటాన్ని బహూకరించారు.

'జీవన్‌రెడ్డి అసలైన కాంగ్రెస్ వాది'

జగిత్యాలకు చెందిన నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అసలు సిసలైన కాంగ్రెస్ వాది అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి కొద్దిసేపు ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి దామోదర రాజ నర్సింహ మాట్లాడుతూ జీవన్‌రెడ్డి ఆసక్తిని కాపాడే ప్రయత్నం చేస్తానని హామీనిచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల అసంపూర్ణంగా ఉన్న ఎంసీహెచ్, మెడికల్ కళాశాల, మెడికల్ కళాశాల బాలుర, బాలికల హాస్టల్స్, మాతా శిశు కేంద్రం, సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణాల అంశంపైన సీరియస్ సమీక్ష చేశామన్నారు. నిర్మాణాలు పూర్తి కావడానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు.

●**కోరుట్ల:** కోరుట్ల నియోజకవర్గంలో వైద్య ఆరోగ్య శాఖలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో నాయకులు రాష్ట్ర మంత్రి దామోదర రాజ నర్సింహకు వినతిపత్రం

●**కోరుట్ల రూరల్/మెట్‌పల్లిటౌన్:** మెట్‌పల్లి పట్టణంలో మాతా శిశు సంక్షేమ ఆసుపత్రిని నిర్మించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేయాలన్నారు.



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు

●గ్రామ పంచాయితీలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్‌లు మంత్రి దామోదర రాజ నర్సింహకు వినతిపత్రం అందించారు.

●**రాయికల్:** రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయికల్ పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, కొయ్యడి మహిపాల్ రెడ్డి, బాపురపు నర్సయ్య పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్సు ఏర్పాటు, ఆసుపత్రుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు.

'ఆసుపత్రుల్లో ఖాళీలను భర్తీ చేస్తాం'

ధర్మపురి: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో త్వరలో ఖాళీలను భర్తీ చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ధర్మపురి క్షేత్రంలో నరసింహస్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన స్వామి దర్శనం అనంతరం ఆలయం ఆవరణలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్, నర్సింగ్ కళాశాలల్లో మౌళిక సదుపాయాలు,, వైద్య, ఆరోగ్య శాఖలో సిబ్బంది నియామకం ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మొదటి దశలో 24 ట్రామా సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయంలో ఏర్పాటు చేసిన మాతా శిశు సంరక్షణ కేంద్రానికి అప్పటి పాలకులు పరిపాలన అనుమతులు మాత్రమే తీసుకు వచ్చారని అన్నారు. ధర్మపురి నియోజవర్గ పరిధిలోని పాశిగాం వద్ద 200 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, అక్కడ ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రి రాజనర్సింహను ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ కోరారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ఆలయ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మకర్తలు ఏదులాపురం మహేందర్, బాదినేని వెంకటేష్ పాల్గొన్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో కోరుట్ల విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): కోరుట పట్టణంలోని మాస్త్రో కళాశాల చదివిన విద్యార్థులు ఎప్‌సెట్ ఫలితాలలో ర్యాంకు సాధించినట్లు కళాశాల కరస్పాడెంట్ ఆకుల రాజేష్ తెలిపారు. ఎంసెట్ అగ్రికల్చర్ విభాగంలో సాయిస్త నూరెన్ రాష్ట్ర స్థాయిలో 2825 ర్యాంకు, ఇంజనీరింగ్ విభాగంలో సత్తి సీతారెడ్డి రాష్ట్ర స్థాయిలో 6910 ర్యాంకు సాధించినట్లు రాజేష్ తెలిపారు. ఉత్తమ ర్యాంకు సాదిధిచిన విద్యార్థులను కరస్పాండెంట్ రాజేష్‌లతో పాటు ఉపన్యాసకులు సన్మాంచారు.

●**పీఆర్‌బీఎంలో..**

పట్టణంలోని పీఆర్‌బీఎం విద్యార్థులు ఎప్‌సెట్ ఫలితాలలో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో దొంతుక కార్తికేయ రాష్ట్ర స్థాయిలో 3969 ర్యాంకు, కుంబ అంజం 7353 ర్యాంకు, మహ్మద్ యూసుఫ్ 8133 ర్యాంకు, జౌనజ్ 11329 ర్యాంకు సాధించినట్లు ప్రవీణ్ తెలిపారు. ప్రతిభ కరనపరిచి విద్యార్థులను కరస్పాడెంట్ ప్రవీణ్ అభినందించారు.

నవజాత శిశువు మృతి

-వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

జగిత్యాలరూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): వైద్యుడి నిర్లక్ష్యం వల్లే తమ బాబు మృతిచెందాడని నవజాత శిశువు బంధువులు ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆందోళన చేశారు. పెగడపల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన జ్యోష్న డెలివరీ కోసం జగిత్యాల ఎంసీహెచ్ ఆస్పత్రిలో శుక్రవారం చేరగా శనివారం బాబుకు జన్మనిచ్చింది. నవజాత శిశువును చికిత్స నిమిత్తం డ్యూటీ డాక్టర్ తన ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకురావాలని చెప్పడంతో అక్కడికి తీసుకెళ్లినట్లు బాధిత బంధువులు ఆరోపించారు. ఈక్రమంలోనే ప్రైవేట్ ఆస్పత్రిలో బాబు మృతిచెందడంతో బంధువులు ఆందోళన చేపట్టారు. డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే శిశుడు మృతి చెందాడని శిశువు తండ్రి శ్రీరాం కృష్ణంరాజు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశాడు.

పంచాయతీ కార్యదర్శి కుటుంబానికి ఆర్థికసాయం

జగిత్యాలరూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బీబీరాజ్‌పల్లి పంచాయతీ కార్యదర్శిగా గతంలో పనిచేసిన రాసమల్ల తిరుపతి అనారోగ్యంతో మృతిచెందగా సహచరులు రూ.32వేల రూపాయలను ఆదివారం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో కార్యదర్శులు ప్రకాశ్, రామయ్య, సత్యనారాయణరావు, వీరయ్య, లక్ష్మన్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

గొల్లపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం రాఘవపట్నానికి చెందిన చిట్యాల గణేష్ ఆకస్మాత్తుగా మృతిచెందాడు. మానవత దృక్పథంతో స్పందించిన రాఘవపట్నం, గంగాదేవిపల్లె గ్రామప్రజలు, వివిధ గ్రామాల ప్రజలు రూ. 31 వేలు మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొడిమ్యాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కొడిమ్యాల, మే 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో 1999-2000 సంవత్సరంలో 7వ తరగతి చదదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కొడిమ్యాలలోని మున్నూరు కాపు సంఘం భవనంలో జరిగింది. ఈ సమ్మేళనంలో విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. గురువులకు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలయ్య, ఉపాధ్యాయులు ఆదిరెడ్డి, సురేష్, మొహనాచారి, పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

●ధర్మపురి: ధర్మపురి మండల కేంద్రంలో దయానంద గీతా విద్యాలయంలో 2007-2008 వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చనిపోయిన ఉపాధ్యాయుడు గోలి రంజిత్, తోటి విద్యార్థులు ముద్దసాని లక్ష్మి, గొడిసెల ప్రశాంత్ జ్ఞాపకాలను గుర్తు చేశారు. అనంతరం అప్పటి ప్రధాన ఉపాధ్యాయులు రాపర్తి నర్సయ్య దంపతులను, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానం చేసి మెమెంటోలు అందించారు.

వైభవంగా నర్సింహస్వామి జయంతి వేడుకలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కొడిమ్యాల, మే11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్ల గొండ గ్రామ శివారులో వెలిసియున్న శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో నర్సింహస్వామి జయంతిని పురస్క రించుకొని ఆదివారం స్వామి వారి కల్యాణం వైభవంగా అర్చకులు నిర్వహించారు. ఉదయం నుండి స్వామి వారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్త లకు ప్రసాదం వితరణతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకన్న, కార్యాలయ సిబ్బంది రవి, కమలాకర్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీకాంతాచార్యులు, మనోజ్‌కుమారాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

●మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి స్వామి వారి జయంతిని పురస్కరించుకొని కరీంనగర్‌కు చెందిన డాక్టర్ లక్ష్మీనారాయణ అండాలు దంపతులు సుమారు 7కిలోల వెండి శేష పడగను ఆలయ ఈవో వెంకన్న సమక్షంలో అర్చకులు శ్రీనివాసాచార్యులకు అందించారు

●బీర్‌పూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలకేంద్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన బీర్‌పూర్ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో నరసింహ స్వామి జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. శ్రీ లక్ష్మినరసింహ స్వామి వారు స్థంబం నుండి ఉద్భవించడంతో అర్చకులు స్థంభ పూజతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయ కులు, భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఒద్దిపర్తి సంతోష్ కుమార్, చిన్న సంతోష్ కమార్, మధు కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్: పట్టణంలోని భీమన్నవాడలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహ కులు పల్లికొండ సుధాకర్, నారాయణ, భగవంతం, వంశీవర్ధన్, పురోహితులు గట్టుపల్లి రమేష్, భక్తులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన కానిస్టేబుల్‌కు సన్మానం

సారంగాపూర్, మే, 11 (ఆంధ్రజ్యోతి) సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో గత నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వర్తించి గొల్లపెల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్ళిన కానిస్టేబుల్ రవిని ఆదివారం ఎస్సై దత్తాద్రి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్ళు, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు పూడూరి శోభన్ పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా పూజలు

కొడిమ్యాల, మే 11(ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఆదివారం మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కార్యాలయ సిబ్బంది, భక్తులు పూజలు చేశారు. భారతదేశం కోసం జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రమూకలతో పోరాడి అమరులైన వీర జవానులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకన్న, కార్యాలయ సిబ్బంది రవి. కమలాకర్, అర్చకులు శ్రీనివాసాచారి, మనోజ్‌కుమారాచార్యులు, రజినీకాంతాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

గుంతలరోడ్డుతో ప్రయాణికుల ఇక్కట్లు



గుంతలమయంగా బొమ్మెన-దూలూరు రోడ్డు

కథలాపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దూలూరు - బొమ్మెన రోడ్డు దుస్థితి మారడం లేదు. మోకాలి లోతు గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజాప్రతినిధులకు ఆయా గ్రామాల ప్రజలు విన్నవిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడని వాపోతున్నారు. ఈ రోడ్డు వెంట మేడిపల్లి, భీమారం మండలాల ప్రజలు కోరుట్ల, వేములవాడ వంటి పట్టణాలకు ప్రయాణీకులు వెళ్తుంటారు. అడుగడుగునా గుంతలు పడి ఉండడంతో వాహన చోదకులు అవస్థలు పడాల్సి వస్తోంది. కంకర తేలి ఉన్నందు వల్ల రాత్రివేళల్లో వాహనాలు నడపడానికి భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. పలుమార్లు ద్విచక్ర వాహన చోదకులు కిందపడి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. దూలూరు. బొమ్మెన, గంభీర్‌పూర్ మీదుగా కొడిమ్యాల మండలంకు వెళ్ళడానికి దూర భారం తగ్గుతుంది. రోడ్డు అధ్వాన్న స్థితిలో ఉన్న కారణంగా వ్యయ, ప్రయాసలకోర్చి ప్రయాణం చేయాల్సి వస్తోందని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో నిధులు వెచ్చించినప్పటికీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాలేదని తెలిసింది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

మల్యాల, మే 11(ఆంధ్రజ్యోతి): సెలవు దినం కావడంతో ఆదివారం కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. వేలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. కాగ మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆదివారం అంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట పోలీస్ అవుట్‌పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గుడికోట ఆలయంలో పూజలు

రాయికల్, మే 11 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని గుడికోట ఆలయంలో సినామా డైరెక్టర్ బలగం వేణు ఆదివారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చ శ్రీధర్, ఎనుగందుల శ్రీనివాస్, సాంబారు శ్రీనివాస్, మంతెన మహేందర్ రెడ్డి, సంకోజి అశోక్, బత్తిని నిరంజన్ గౌడ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాయికల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైతాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జగిత్యాల పట్టణానికి చెందిన వాణి ఆస్పత్రి, శ్రీరామ న్యూరో సైకియాట్రీ ఆస్పత్రుల ఆధ్వర్యంలో వైద్యులు ప్రణయ్ రెడ్డి, సంతోష్ కుమార్, స్వాతిలు 300 మందికి ఉచితంగా వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రుల మేనేజర్లు బి.గోపాల్ నాయక్, ఎ.విజయ్ కుమార్, నాయకులు గన్నె రాజరెడ్డి, స్థానిక పీఎంపీలు రామకృష్ణ, గంగాధర్ పాల్గొన్నారు.

పశు వైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరత

●ఇబ్బందులు పడుతున్న పశు పోషకులు ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

బీర్‌పూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పశువైద్య కేంద్రంలో సిబ్బంది లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో గల ప్రాథమిక పశు వైద్య కేంద్రంలో సిబ్బంది లేక పోవడంతో మండలంలోని 17 గ్రామాల పశువులకు సరైన సమయంలో చికిత్స అందడం లేదు. ఉమ్మడి మండలమైన సారంగాపూర్ మండలం ప్రాథమిక పశువైద్య కేంద్రంతో పాటు రెచపల్లి, పెంబట్ల, అర్పపల్లి గ్రామాలలో సబ్ సెంటర్లు ఉన్నాయి. నూతనంగా ఊర్పడిన బీర్‌పూర్ మండలంలో మొదట్లో 11 గ్రామాలు ఉండగా అవి కాస్తా 17 గ్రామాలుగా ఏర్పడ్డాయి. ఈ 17 గ్రామాలకు గాను కేవలం ఒకే ఒక పశువైద్య కేంద్రం ఉండడం అందులో సిబ్బంది లేకపోవడంతో 7241 కుటుంబాలలోని 1646 ఆవులు, 2807 గేదలు,14053 గొర్లు, 4096 మేకలు, 13783 కోళ్ళు ఉండగా వాటికి వైద్యం ఎలా అందుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రాథమిక పశువైద్యకేంద్రంలో ఒక వెటర్నరి సర్జన్, ఒక వెటర్నరి అసిస్టెంట్, ఒక అటెండర్ ఉండాలి. కానీ పశు వైద్యకేంద్రంలో వెటర్నరి సర్జన్ సారంగాపూర్ వైద్యులకు ఇన్‌చార్జి ఇవ్వగా ఇటీవల వెటర్నరి అసిస్టెంట్‌గా వచ్చిన సిబ్బంది ప్రమోషన్‌పై వెళ్లారు. ఇంకా కేవలం ఉన్నది అటెండర్ మాత్రమే. వైద్య అనుభవం ఎంతమాత్రం లేకపోవడంతో ఆసుపత్రికి పశువులతో వచ్చిన రైతులు అసంతృప్తితో వెనుతిరిగి వెళ్తున్నారు. 17 గ్రామాల రైతులకు మెరుగైన వైద్యం అందాలంటే ప్రాథమిక పశువైద్య కేంద్రానికి ప్రత్యేకంగా వెటర్నరి సర్జన్, వెటర్నరి అసిస్టెంట్‌తో పాటు మంగేళ, కండ్లపెల్లి గ్రామాలలో సబ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే రైతులకు మెరుగైన సేవలు అందుతాయని రైతులు అభిపాయపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి తుంగూర్ ప్రాథమిక పశు వైద్య కేంద్రానికి ప్రత్యేక వైద్యులను, వెటర్నరి అసిస్టెంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.



తుంగూర్‌లోని ప్రాథమిక పశువైద్య కేంద్రం

కథలాపూర్ మండలంలో..

కథలాపూర్: కథలాపూర్ మండలంలోని అంబారి పేట, కథలాపూర్ గ్రామాల్లో మాత్రమే ప్రాథమిక పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. సిరికొండలో ఉన్న ఉపకేంద్రం తక్కళ్ళపల్లి, సిరికొండ గ్రామాల రైతుల మూగ జీవాలకు వైద్యం అందిస్తోంది. అంబారి పేట పరిధిలో పోతారం, తుర్తి, గంబీర్‌పూర్ గ్రామాలకు వైద్యం అందా లంటే దూరంగా ఉంటోందని రైతులు వాపోతున్నారు. గత 15 సంవత్సరాల కింద గంబీర్‌పూర్, తాండ్ర్యాల గ్రామాల్లో ఆ గ్రామస్థులు సొంత నిధులతో ఉప కేంద్రాలు నిర్మించుకున్నా ప్రభుత్వాలు సిబ్బందిని నియమించలేదు. అధికారికంగా మంజూరు లేదనే సాకుతో ఎలాంటి సిబ్బందిని కేటాయించలేదు. భూషణరావుపేటలో ఇరవై సంవత్సరాల కిందట అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని విద్యాసాగర్‌రావు సీడీపీ నిధులతో ఉప కేంద్రం నిర్మించినప్పటికీ సిబ్బందిని ఇవ్వకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కథలాపూర్ ప్రాథమిక పశువైద్య కేంద్రానికి వెళ్ళి వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. విద్యుదాఘాతాలు, పాముకాటు సమయాల్లో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలను దూరంలో కేంద్రాలకు తీసుకెళ్ళాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నూతనంగా ఉపకేంద్రాలను నిర్మించడంతో పాటు సిబ్బందిని కేటాయించాలని కోరుతున్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

కొడిమ్యాల, మే11(ఆంధ్రజ్యోతి) : క్రీడలు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో గ్రామ మాజీ సర్పంచు పిడుగు ప్రభాకర్‌రెడ్డి కుమారుడు పిడుగు సాకెత్‌రెడ్డి ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ క్రీడలు ఆదివారం ముగిసాయి. క్రీడల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవటానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. అనంతరం మొదటి బహుమతి కొడిమ్యాల శేఖర్ 11 టీం కప్ 15వేల రూపాయల చెక్, రెండవ బహుమతి కొడిమ్యాల 11స్టార్ టీం కప్, 10వేల రూపాయల చెక్‌నులకు డీఎస్పీ అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు మాజీ సర్పంచు పిడుగు ప్రభాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, నాయకులు చంద్ర మోహన్‌రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కోరుట్ల రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పభుత్వంతోనే సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని సర్పరాజుపూర్ గ్రామంలో నూత నంగా నిర్మాణం చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను కృష్ణారావు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లా డారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తున్నాడని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు దశల వారిగా ప్రభుత్వం అందిస్తున్న పారితోషకం అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు తోట గంగాధర్, నాయకులు తిరుమల గంగాధర్, ఏలేటి మహిపాల్ రెడ్డి, అన్నం అనిల్, బలిజ రాజారెడ్డి, కొత్తం నవీన్, రాజం, నవీన్‌లు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

ధర్మపురి మే, 11 (ఆంధ్రజ్యోతి) :ఏషియన్ పవర్ లిఫ్టింగ్ యూనివర్సిటీ చాంపియన్ 52 కేటగిరిలో శ్యామ్‌రావ్ ఐశ్వర్య గోల్డ్ మెడల్, 76 కేజీల విభాగంలో కుమ్మరి పూజిత సిల్వర్ మెడల్ సాధించారు.ఈ పోటీలు ఉత్తరకండ్‌లోని డెహ్రడాంలో జరిగాయి. ఐశ్వర్య ప్రస్తుతం కరీంనగర్ ఎస్సారఆర్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. స్వస్థలం ధర్మపురి. కుమ్మరి పూజిత అదే కళాశాలలో బీకాం సెకండ్ ఇయర్ చదువుతోంది. పూజిత స్వస్థలం ధర్మపురి మండలంలోని కమలపూర్ ఈ సందర్భంగా వీరిని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థికి సన్మానం

కొడిమ్యాల, మే11(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ సూల్‌లో 9వ తరగతి చదువుతున్న కొలకాని అశ్విని ఇస్రోకి ఎంపికైనందున ఆదివారం కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు నాచుపల్లిలో శాలువా కప్పి సన్మానం చేశారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇస్రోకు ఎంపిక కావటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, మే11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామంలో గల మార్కెండేయస్వామి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌లో స్థిరపడిన అదె గ్రామానికి చెందిన చిరంజీ సత్య నారాయణఅంజలి దంపతులు లక్ష 116 రూపాయలను సమకూర్చారు. దాత ఆడపడుచులు, వారి కుటుంబ సభ్యులు బాగ్య, భారతి ఆలయ కమిటీ అధ్యక్షుడు వడ్లకొండ లక్ష్మీపతికి అందించారు.

మదర్స్ డే వేడుకలు

పెగడపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని నార్సింహని పేట గ్రామంలోని వాయిస్ ఆఫ్ లవ్ చర్చిలో ఆదివారం మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మాతృ మూర్తులను శాలువాలతో సత్క రించారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహ కులు ఎజ్రా మల్లేశం, ప్రార్ధన రేఖ, సామ్యూల్, దీప, కరుణాకర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.